క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: పేకాటాడుతున్న పది మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. స్థానిక ఎస్ఆర్ ఐ ఆస్పత్రి వెనుక ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 53,484 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సైలు రామగణేష్, వి.అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలోని అయ్యన్నపేట జంక్షన్‌లో మదర్ థెరీసా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ సంతోషి ప్రారంభించారు. సేవా సంఘం అధ్యక్షుడు త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంతోషి మాట్లాడుతూ, వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు త్యాడ వేణుగోపాలం, సభ్యులు తనీష్, జామి సూరిబాబు, సింబోతుల ప్రసాద్, మహంతి ప్రసాద్, బెల్లాన అప్పారావు, చైతన్య, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గంగరాజు

గజపతినగరం: వాహన చోదకులు అంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ గంగరాజు సూచించారు. మండల కేంద్రంలోని బైరిపురం జంక్షన్ రోడ్డులో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించవద్దని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ



ఉపాధ్యాయులకు సౌండ్ సిస్టమ్‌ను అందజేస్తున్న బెహరా విద్యా సంస్థల ఎం.డి విజయ బెహరా

జామి: స్థానిక ఉన్నత పాఠశాలకు బెహరా విద్యాసంస్థల తరఫున ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విజయబెహరా సుమారు రూ.25 విలువ కలిగిన సౌండ్ సిస్టమ్‌ను ఉపాధ్యాయులకు ఆదివారం అందజేశారు. జామి పాఠశాల ఉపాధ్యాయులు గుండాల శ్రీనివాసరావు, పి.డి.చంద్రశేకర్ అభ్యర్థన మేరకు బెహరా విద్యా సంస్థల వారు సౌండ్‌సిస్టమ్ సమకూర్చారు. బెహర సంస్థల యాజమాన్యానికి పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ రెహమాన్ కృతజ్ఞతలు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాపై అవగాహన కల్పిస్తున్న శిక్షకురాలు శోభ

బొండపల్లి: రోజూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా శిక్షకులు యు.శోభ చెప్పారు. గొట్లాం గ్రామంలోని షిర్డీసాయి ధ్యాన మందిరంలో పిరమిడ్ సేవాదళ్ సభ్యులకు ధ్యానం, యోగాపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన శైలిలో మార్పులు, వృత్తిపరంగా ఎదురయ్యే సమస్యల వల్ల నేడు చాలా మంది మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, వీటిన్నంటి పరిష్కారానికి యోగా ఒక్కటే మార్గమని తెలిపారు. పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు పాల్గొన్నారు.

పెంటశ్రీరాంపురంలో వైద్యశిబిరం



శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు

గంట్యాడ: మండలంలోని పెంటశ్రీరాంపురం గ్రామంలో తగరపువలసకు చెందిన ఎన్ఆర్ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గైనిక్, జనరల్ మెడిసిన్ విభాగాల వైద్యులు శిబిరంలో 200 మందికి వివిధ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ కరక మహేష్, ఎంపీటీసీ సిరపురపు శ్యామల, యర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 48, 49, 50 డివిజన్‌లలో రూ.54 లక్షలతో అభివృద్ధి పనులు



తాగునీటి పైప్‌లైన్ల పనులకు సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కోలగట్ల, తదితరులు

విజయనగరం: నగర శివారు ప్రాంత ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ మేరకు నగరంలోని 48, 49, 50 డివిజన్‌ల పరిధిలో రూ.54 లక్షలతో చేపట్టదలచిన అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 49వ డివిజన్‌లో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు రూ.16 లక్షలతో 50వ డివిజన్‌లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా 48, 49, 50 డివిజన్‌లలో రూ.30 లక్షల 15వ ఆర్థిక సంఘ నిధులతో తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు పనులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, నగర ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే శంకుస్థాపన వారోత్సవాలు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు రూ.54 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ కంటుభుక్త తవిటిరాజు మాట్లాడుతూ, నగరంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు చేపట్టడంలో కోలగట్ల వీరభద్రస్వామి సఫలీకృతులయ్యారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, కార్పొరేటర్లు పట్టా ఆదిలక్ష్మి, కసుగుల రాజ, సీనియర్ నాయకుడు రొంగలి పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తి సన్నిధిలో ఎమ్మెల్యే బడ్డుకొండ



ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ, తదితరులు

డెంకాడ: అరసవిల్లి సూర్యనారాయణస్వామిని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే, తదితరులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుతో పాటు కుమారులు మణిదీప్, ప్రదీప్‌లు సతీసమేతంగా సూర్యభగవానుడికి పూజలు చేశారు. వారితో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సతీమణి పుష్పాంజలి కూడా సూర్యదేవున్ని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

పరీక్ష మెటీరియల్ పంపిణీ

విజయనగరం రూరల్: మండలంలోని చెలువూరు గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థులకు వైఎస్సార్ సీపీ నాయకుడు బోద అప్పలకృష్ణ పరీక్షల మెటీరియల్ కిట్‌లను పంపిణీ చేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు వంద మంది విద్యార్థులకు అట్టలు, పెన్సిళ్లు, పెన్నులు, రబ్బర్లు, స్కేళ్లు, తదితర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో వర్షం



వర్షంలో బస్సు ఎక్కేందుకు ఎదురుచూస్తున్న ప్రయాణికులు



రింగ్‌రోడ్డు వద్ద రోడ్డుపై చేరిన నీరు



కాంప్లెక్స్ ఆవరణలో చేరిన నీరు

విజయనగరం: జిల్లా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడి ప్రతాపంతో ప్రజలు ఉక్కబోతతో ఇబ్బంది పడగా... మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రెండు గంటల నుంచి చిన్నపాటి చినుకులతో ప్రారంభమైన వర్షం సాయంత్రం 4 గంటల వరకు కురిసింది. దీంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలంతా సేదతీరారు. ఇదిలా ఉండగా వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో జలమయమయ్యాయి.

ప్రయాణికులకు ఇక్కట్లు...

విజయనగరం టౌన్: పట్టణంలో కురిసిన వర్షానికి ఆర్టీసీ ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాంప్లెక్స్ ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోవడంతో పాటు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు వర్షంలోనే తడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. బస్సు ఎక్కేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది.

ఒత్తిడికి గురికావొద్దు



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న కేసలి అప్పారావు

చీపురుపల్లి: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించనున్న నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దని, ఆరోగ్యం, ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. చీపురుపల్లి కేజీబీవీని ఆదివారం ఆయన సందర్శించి పదో తరగతి విద్యార్థినులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో సూచనలు చేశారు. విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరీక్షా కేంద్రాలకు రవాణా సదుపాయాలు కల్పించి సురక్షితంగా నిర్ణీత సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకునేలా చూడాలని కేజీబీవీ సిబ్బందికి సూచించారు. ప్రిన్సిపాల్ హైమావతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



వృద్ధులకు సరుకులు అందజేస్తున్న ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ సుధీర్, తదితరులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన 36 మంది ఒంటరి వృద్ధులకు ఆదివారం 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ సుధీర్ మాట్లాడుతూ పేద ఒంటరి మహిళలకు ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు చేస్తున్న సేవలు అమోఘమైనవని అన్నారు. ట్రస్టు అధ్యక్షుడు విశ్వనాథ హరికుమార్, సభ్యులు రవి, నగేష్, వరహాలు, తీగల గుప్తా, పూసర్ల రామన్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

రామభద్రపురం: ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ తిరుమలరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ సురేంద్రనాయుడుతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన వినోదం కోసం నిర్వహించే క్రికెట్ పోటీలను కొందరు జూదరులు కల్పతరువుగా మార్చుకుంటున్నారని అది మంచిది కాదన్నారు. బెట్టింగులకు పాల్పడి డబ్బులు పోగొట్టుకున్న వారు చెడువ్యసనాలకు బానిసలవ్వడంతో పాటు ఆత్మహత్య చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పుడు గ్రామాలకు కూడా ఈ జాడ్యం పాకిందని, నిఘా పెడుతున్నామన్నారు. ఎవరు పట్టుబడినా కఠిన చర్యలు తప్పవన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: ప్రాథమిక స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీ హెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా అనేక విషయాలు తెలియడంతో పాటు జ్ఞానం పెంపొందుతుందన్నారు . ఏయే పుస్తకాలు చదవాలి, ఎలా చదవాలన్న దానిపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

చెప్పారంటే.. చేస్తారంతే..

- అదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నైజం
- మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం ధ్యేయం
- ఆసరా సంబరాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వేదికపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు



ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

వేపాడ: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏదైనా చెబితే దాన్ని చేసి తీరుతారని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చిన మాటకు నిలబడడమే ఆయన నైజమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో వెలుగు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా సంఘాలకు రుణ మాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు మాటలు నమ్మి ఓటేసి గెలిపిస్తే..రుణమాఫీ చేయకుండా ఆయన తమను మోసం చేశారని పలువురు మహిళలు పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చి న్యాయం చేయాలని కోరారని గుర్తుచేశారు. అక్కచెల్లెమ్మల అభ్యర్థన మేరకు 2019 ఏప్రిల్ 11 నాటికి డ్వాక్రా సంఘాలకు ఎంత రుణం బకాయి ఉంటే అంత మొత్తాన్ని నాలుగువిడతల్లో చెల్లిస్తామని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. నాడు ఇచ్చిన మాటను సీఎం అయిన తర్వాత జగన్ నిలబెట్టుకున్నారని, ఇప్పటికే వైఎస్సార్ ఆసరా పథకం కింద డ్వాక్రా సంఘాలకు రుణ బకాయిల మొత్తాన్ని మూడు విడతల్లో జమచేశారని తెలిపారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో టీడీపీ నాయకులు మళ్లీ గ్రామాల్లోకి వచ్చి చంద్రబాబులా మాయ మాటలు చెబుతారని, జగన్ అంటే నచ్చని కొన్ని పత్రికలు, మీడియా చానెళ్లు ప్రచురించే తప్పుడు కథనాలు, అబద్దాల ప్రచారాన్ని నమ్మవద్దని, వాస్తవాన్ని గుర్తించాలని మహిళలకు సూచించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా పోలవరం ప్రాజెక్టు నుంచి నీటిని మన ప్రాంతానికి తేవడానికి నాడు అపరభగీరథుడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుడితే నేడు సీఎం జగన్ మన పొలాలను సస్యశ్యామలం చేయడానికి రూ.150 కోట్లు మంజూరు చేశారని జెడ్పీ చైర్మన్ చెప్పారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామాల్లో ప్రతీ ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తున్నా మన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని నాడు నిరుద్యోగులను టీడీపీ మోసం చేసిందని, జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన వెంటనే గ్రామ సచివాలయ వ్యవస్థను నెలకొల్పి రాష్ట్రంలో 1.25 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్ మహిళా పక్షపాతి అని అన్నారు. మండలంలో 1,262 డ్వాక్రా సంఘాల్లోని 14,264 మంది మహిళల ఖాతాల్లో ఆసరా మూడో విడతగా రూ. 6,62,87,727 జమ చేశారన్నారు. కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే మహిళలు ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాలు సైతం కావాలన్నా జన్మభూమి కమిటీలను ఆశ్రయించాల్సి వచ్చేదని, వారికి లంచాలు ఇస్తూ, ఇంటిపై టీడీపీ జెండా కడితేనే అందేవని గుర్తు చేశారు. నేడు జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ టీడీపీ హయాంలో అన్ని వర్గాల ప్రజలు నయవంచనకు గురయ్యామని, నేడు సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందని చెప్పారు. సభ ప్రారంభానికి ముందుగా ఐకేపీ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు పరిశీలించారు. సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినుల దింసా నృత్యం ఆకట్టుకుంది. డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్‌పర్సన్‌మూకల కస్తూరి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పద్మావతి, పంచాయతీరాజ్ జోనల్ కన్వీనర్ ఎం.సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీఓ పట్నాయక్, ఐకేపీ కో-ఆర్డినేటర్ జయశ్రీ, ఏపీఎం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఆసరా ఆర్థికంగా ఆదుకుంది



వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు ఆర్థిక భరోసా కలిగించింది. ఆసరా, ఇతర పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో కిరాణా దుకాణం నిర్వహిస్తూ, జీవనం సాగిస్తున్నాను. మూడు విడతల్లో ఆసరా పథకం ద్వారా రూ.36 వేలు అందుకున్నాను. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– నెక్కల చిన్నమ్మలు, వేపాడ

భరోసా కల్పించారు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఆసరా పథకం ద్వారా ఇప్పటివరకు రూ. 39వేలు అందాయి. ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న డబ్బులు ఎస్‌హెచ్‌జీ రుణంతో చేస్తున్న సిమెంట్ వ్యాపారానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– కంకటాల నాగమణి, సోంపురం, వేపాడ మండలం

అందుబాటులో అన్నిరకాల వైద్యసేవలు

- కేర్ హాస్పిటల్ వార్షికోత్సవంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



ఆస్పత్రి ఎం.డికి జ్ఞాపికను అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రాజాం సిటీ: రాజాం ప్రాంత ప్రజలకు అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన జీఎంఆర్ కృషి అభినందనీయమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక జీఎంఆర్ ఐటీలో వరలక్ష్మీ కేర్ ఆస్పత్రి 12వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైద్యులు దేవుళ్లతో సమానమని, అందుకే వైద్యో నారాయణోహరి అని పెద్దలు అంటుంటారని గుర్తు చేశారు. గ్రంధి మల్లిఖార్జునరావు ముందు చూపుతోనే మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆస్పత్రి నెలకొల్పారన్నారు. నాణ్యమైన విద్యతో పాటు వైద్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. గతంలో ఏ చిన్న చికిత్స చేసుకోవాలన్నా విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు అందరికీ అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జీఎంఆర్ రాజాం వాసి కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. ఆస్పత్రి, కళాశాలలు స్థాపించి, ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. మున్ముందు మరిన్ని సేవలు ప్రజలకు చేరువ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందికి జెడ్పీ చైర్మన్ జ్ఞాపికలు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, గ్రంధి నీలాచలం, ఆస్పత్రి ఎండీ దామెర రాజేంద్ర, జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15 మద్యం సీసాల స్వాధీనం

బొబ్బిలి: అక్రమంగా మద్యంబాటిళ్లు తరలిస్తున్న మండలంలోని హరిజన పాల్తేరుకు చెందిన చింతాడ వెంకయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, 15 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ గుంట్రెడ్డి భాస్కరరావు తెలిపారు. సదరు వ్యక్తిని ఆదివారం కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి 10 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ అవస్థలు

రామభద్రపురం: మండల కేంద్రం మీదుగా భారీ వాహనాల రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో ఇటువంటి పరిస్థితి నెలకొనడంతో అటువైపుగా ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో తమ గమ్య స్థానాలకు చేరుకోలేకపోతున్నారు. గంటల తరబడి అలాగే రోడ్లపై ఉండిపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా రామభద్రపురం నుంచి సాలూరు వెళ్లేందుకు బస్సులు, అటువైపుగా ఒడిశా వెళ్లేందుకు గ్రామం(రామభద్రపురం) మధ్యలో రోజుకు వందల కొలది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. గ్రామం చివరలో ఎన్‌హెచ్-26 బైపాస్ రోడ్డు ఉన్నా అటువైపుగా వెళ్లకుండా గ్రామం మధ్యలోనే రాకపోకలు సాగిస్తుండడంతో గ్రామస్తులు, వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగునీటి కాలువలు పూర్తిగా శిథిలం కావడంతో పాటు రోడ్డుకు అనుకుని ఉన్న ఇళ్ల యజమానులు కొంత మేర రోడ్డును ఆక్రమించుకోవడంతో రోడ్డు ఇరుకుగా తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు చెప్పినా భారీ వాహనాలు నడిపే వారు వినడం లేదు. దీంతో స్థానికులకు ట్రాఫిక్ జామ్ ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

వంగర: మండలంలోని పెదరాజులగుమ్మడ, చినరాజుగుమ్మడ, వీవీఆర్ పేట, జేకే గుమ్మడ గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఆదివారం వేశారు. వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేసినట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. వ్యాధి లక్షణాలతో పశువులు బాధపడితే దగ్గరలోని పశువైద్య కేంద్రానికి గానీ సంచార పశువైద్య శాలకు గానీ సమాచారం ఇవ్వాలన్నారు.